Eenadu

Dt 29/11/17





మెట్రో రైలు పైలాన్‌ను ఆవిష్కరించి.. రైలులో ప్రయాణిస్తున్న ప్రధాని మోదీ, గవర్నర్ నరసింహన్, ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్, భాజపా తెలంగాణ అధ్యక్షుడు లక్ష్మణ్

# పట్టాలెక్కిన మెట్రో

- ప్రారంభించిన ప్రధాని మోదీ
- పైలాన్, యాప్‌ల ఆవిష్కరణ
- రైలులో 11 నిమిషాలపాటు ప్రయాణం
- ఆయనకు ప్రాజెక్టు విశేషాలను వివరించిన మంత్రి కేటీఆర్

ఈనాడు, హైదరాబాద్: ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం హైదరాబాద్ మెట్రో రైలును లాంఛనంగా ప్రారంభించి, జాతికి అంకితం చేశారు. అక్కడ ఏర్పాటుచేసిన పైలాన్‌ను ఆవిష్కరించారు. మియాపూర్ నుంచి కూకట్‌పల్లి వరకు, అక్కడి నుంచి తిరిగి మియాపూర్ వరకు దాదాపు 11 నిమిషాలపాటు రైలులో ప్రయాణించారు. రైలులో తన పక్కన కూర్చున్న రాష్ట్ర పురపాలక మంత్రి కేటీఆర్‌ను అడిగి ప్రాజెక్టు ప్రత్యేకతలను తెలుసుకున్నారు. ప్రపంచ పారిశ్రామికవేత్తల సదస్సులో పాల్గొనేందుకు... ప్రధాని మోదీ మంగళవారం మధ్యాహ్నం 1.18 గంటలకు వాయుసేనకు చెందిన ప్రత్యేక విమానంలో బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడ గవర్నర్ నరసింహన్, సీఎం కేసీఆర్‌లు ఆయనకు (మిగతా 2లో)

## నేటి నుంచే పరుగులు

- మియాపూర్–నాగోలు నడుమ 24 స్టేషన్లలో ఆగనున్న 18 రైళ్లు
- 64 నిమిషాల్లోనే ఆ చివరి నుంచి ఈ చివరికి చేరవచ్చు

-2లో

- తొలిరోజు అంచనా లక్షమంది
- అవసరమైతే మరిన్ని ట్రిప్పులు


# పట్టాలెక్కిన మెట్రో


(మొదటి పేజీ తరువాయి)

స్వాగతం పలికారు. తరువాత విమానాశ్రయంలోనే ఏర్పాటుచేసిన వేలాది మంది భాజపా కార్యకర్తల సమావేశంలో ఆయన కొద్దిసేపు ప్రసంగించారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో 2.08 గంటలకు మియాపూర్ స్టేషన్‌కు చేరుకున్నారు. అక్కడ ఏర్పాటుచేసిన పైలాన్‌ను గవర్నర్, ముఖ్యమంత్రి సమక్షంలో ప్రధాని ఆవిష్కరించారు. అనంతరం మెట్రో స్టేషన్‌లో ఐదు నిమిషాలపాటు ప్రాజెక్టుపై ప్రదర్శించిన వీడియోను ఆసక్తిగా తిలకించారు. అక్కడ రిబ్బన్‌ను కత్తిరించి, రైలును ప్రారంభించారు. ఆ సమయానికి మంత్రి కేటీఆర్ కొద్ది దూరంలో ఉండగా... ప్రధాని పిలిచి, కేటీఆర్ వచ్చిన తర్వాతే రిబ్బన్‌ను కత్తిరించారు. మెట్రో యాప్‌ను ఆవిష్కరించారు. అక్కడి నుంచి మోదీ మెట్రోరైలులోనే కూకట్‌పల్లికి వెళ్లి వచ్చారు. ప్రధానితో పాటు మెట్రో రైలులో గవర్నర్ నరసింహన్, ముఖ్యమంత్రి కేసీఆర్, కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ సహాయ మంత్రి హర్‌దీప్‌సింగ్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీసింగ్, ఎల్‌అండ్‌టీ ప్రతినిధులతో పాటు... మంత్రి కేటీఆర్, భాజపా నేతలు లక్ష్మణ్, కిషన్‌రెడ్డి, మరికొందరు నాయకులు ప్రయాణించారు. రైలులో ప్రధానికి ఒకవైపు కూర్చున్న మంత్రి కేటీఆర్... ప్రాజెక్టుకు సంబంధించిన అనేక విషయాలను ఆయనకు వివరించారు. ప్రధాని ఈ వివరాలను ఆసక్తిగా ఆలకించారు. ప్రయాణంలో ప్రధానికి, అక్కడి వారికి మధ్య ఆసక్తికర సంభాషణ జరిగినట్లు అధికారులు తెలిపారు. ప్రధాని ప్రయాణించిన మెట్రో రైలును మహిళా లోకో పైలెట్ నడిపారు.

### మూడు హెలికాప్టర్లలో

బేగంపేట నుంచి మియాపూర్‌కు, ఆ తర్వాత హెచ్ఐసీసీకి ప్రధానమంత్రి ప్రత్యేక హెలికాప్టర్లలో వెళ్లారు. ప్రధానితోపాటు గవర్నర్, ముఖ్యమంత్రి ఒక హెలికాప్టర్‌లో వెళ్లారు. మరోదాంట్లో ప్రధానమంత్రి కార్యాలయ అధికారులు, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్, శాసనసభాపక్షనేత జి.కిషన్‌రెడ్డి.. మూడో దాంట్లో రాష్ట్ర ఇతర అధికారులు బేగంపేట నుంచి బయల్దేరి వెళ్లారు.